


నెలనెలా అభిమానుల, శ్రేయోభిలాషుల ప్రతిస్పందన..

'వసుంధర' గారి ద్వారా సుజనరంజని పత్రిక పరిచయమై ఇంటర్నెట్లో చదవడం జరిగింది. అభినందనలు. మార్చి-2005 పత్రిక చూశాను. దూరంగా ఉన్న వారికి ముఖ్యంగా ప్రవాసాంధ్రులకు అమెరికా దేశంలో తమ ఊరు గుర్తుకు రావడం సహజం. మా ఊరంటే మాకిష్టం చదివిన తరువాత ఇండియాలో ఆంధ్రప్రదేశ్ లో తూర్పుగోదావరి జిల్లాలో ఆత్రేయపుర మండలములో ఒక గ్రామమైన 'పేరవరము' లో ఉన్న నాకు సుస్మిత రచనలోని గ్రామీణ వాతావరణం రోజూ చూస్తున్నదే అయినా, ఆ రచన చదివిన తరువాత మా ఊరంతా ఒకసారి కలయ తిరిగి, ఒక వింత అనుభూతి పొంది, మా ఊరు మీద ఏర్పడిన ఇష్టాన్ని గూర్చికూడ సుజనరంజనితో ముచ్చటించాలనిపిస్తోంది. అన్ని శీర్షికలూ చాలా బాగున్నాయి. రచయితలకూ, పత్రికను అందంగ తీర్చి దిద్దిన మీకు అభినందనలు

డా. జొన్నలగడ్డ మార్కండేయులు , లెక్చరర్
పేరవరం-533 235
తూర్పుగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్, ఇండియా.

* * * * * *

మార్చి నెలలో వచ్చిన శ్రీ రాళ్ళబండి కవితా ప్రసాద్ గారి కథ చదివాక చాలాసేపు ఆ వాతావరణంలో నుంచీ బయటికి రాలేకపోయాను. ఎంత అద్భుతంగా వుందీ .. వర్ణన, కథనం, ముగింపూ..!! ఇంకాస్సేపు రేపల్లెలో ఉండి పోతే బావుండుననిపించింది. ఇంత చక్కని కథని అందించిన సుజనరంజని కి అభినందనలు..

రాయప్రోలు సత్య శర్వాణి, విశాఖపట్నం

ఒక ప్రయాణం.. ఆగి పోకుండా మరికొంతసేపు సాగితే బావుండునని పించింది.. ఎవరి ప్రయాణం ఆ-గింది..!? రచయితగారు గుండెల్ని మెలిపెట్టి వదిలారు.. హేట్సాఫ్..కవితా ప్రసాద్ గారూ..!

- సుంకర శ్రీమన్నారాయణ

సిన్సినాటి

******

ఇంతవరకూ మీరు ప్రచురించిన కథలన్నీ ఒక ఎత్తు..ఒక ప్రయాణం ఒక్కటే ఒక ఎత్తు..!

- రాంబాబు, శోభ అడుసుమిల్లి

సిడ్నీ, ఆస్ట్రేలియా

******

శంకరనారాయణ గారి 'రాత-కోత' లో పదును పెరగాలి..ఈ నెల అంశం మరీ సాదా సీదాగా వుంది

-అమ్మనబోలు జ్యోతి ప్రసాద్, సన్నీవేల్

******

చిట్టెన్ రాజు గారూ..రెండు నెలల అజ్ఞాత వాసం తరువాత..మహత్తరమైన ఆయుధంతో విరుచుకు పడ్డారు కదండీ..అంతా క్షేమమే కదా..!

- బి. చిట్టిబాబు , విజయనగరం

******

దిలీప్‌గారి చూపులు కలిసిన శుభవేళ లో మొట్టమొదటి వాక్యమే గమ్మత్తుగా మొదలై మమ్మల్ని ఆసాంతం చదివించింది. . కేవలం రచనలే కాకుండా రచయితల పరిచయాలు కూడా క్రమం తప్పకుండా ప్రచురిస్తున్న మీ కృషి ప్రశంసనీయం. దిలీప్ గారి పరిచయం చదివి, ఆయన నేపథ్యం తెలుసుకుని చాలా ఆశ్చర్యపోయాం. పట్టుదల ఉంటే మనిషి ఏమైన సాధించగలడు అనడానికి దిలీప్ గారు ఒక ఉదాహరణ..!

- నగేష్, న్యూజెర్సీ

******

దిలీప్‌గారి వివాహ విశేషాలూ, ఆయన నటించిన పొట్టిరాయుడు నాటికా..ఒకే సంచికలో రావడం..బావుంది...

- రాచూరి ప్రసాద్ , ఫిలడెల్ఫియా

******

సుస్మిత గారు రాసిన వూరి కబుర్లూ, కబుర్లకి తగ్గ ఫోటోలూ ఆ శీర్షికని ఎంతో ఆకర్షణీయంగా తీర్చి దిద్దాయి. అందులోని ప్రతి వాక్యం వాళ్ళ వూరిని మా కళ్ళముందు ఆవిష్కరించడమే గాక, మావూరి గురించికూడ ఒక్కసారి నెమరేసుకునేలా చేశాయి..

-ఆర్.రాధాకుమారి, డెన్వర్